ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 22 జూలై 2024 | 5



నేటి నుంచి స్వచ్ఛతా వారోత్సవాలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 21: స్వచ్ఛత వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు కాకినాడ వివేకానంద పార్కు నుంచి కలెక్టరేట్ వరకు స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహిస్తారన్నారు. ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు





నియోజకవర్గ సమస్యలపై గళమెత్తుతాం

ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు, పర్యటనలలో గుర్తించిన సమస్యలపై గళం విప్పేందుకు ఎమ్మెల్యేలు సమాయత్తమవుతున్నారు. ఎమ్మెల్యేలు ప్రాజెక్టు రిపోర్టులతో ఆదివారం నాడే అమరావతికి పయనమయ్యారు. నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అసెంబ్లీనే సరైన వేదికని భావిస్తున్న ఎమ్మెల్యేలు ఆ దిశగా తమ గళం వినిపించేందుకు రెడీ అవుతున్నారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు ఏయే సమస్యలను ప్రస్తావించనున్నారో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తేందుకు ఎమ్మెల్యేలు సన్నద్ధం
ప్రాజెక్టు రిపోర్టులతో అమరావతికి..
నిధులు సాధించే లక్ష్యంతో ముందుకు



తుని నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలపై మాట్లాడతా..

తుని ప్రాంత వాసుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా అసెంబ్లీలో గళం విప్పుతా..తుని నియోజకవర్గం సమస్యలను అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాను. ముఖ్యంగా ఎన్నికల హామీగా ఉన్న తునిలో మహిళా నర్సింగ్ కళాశాల అంశాన్ని ప్రస్తావిస్తా.. అలాగే దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్న తాండవ రిటర్నింగ్ వాల్, పట్టణ సుందరీకరణ పనులు,తాగు, సాగునీరు కోసం అసెంబ్లీలో మాట్లాడతా..

యనమల దివ్య, ఎమ్మెల్యే, తుని నియోజకవర్గం
– తుని రూరల్



నిలిచిపోయిన వివిధ ప్రాజెక్టుల గురించి అసెంబ్లీలో ప్రస్తావిస్తా

గత ప్రభుత్వంలో నిధులు విడుదల కాకపోవడంతో కాకినాడ సిటీ నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాజెక్టు పనులు మధ్యలో నిలిచిపోయాయి. అందువల్ల కాకినాడ స్మార్ట్ సిటీ పెండింగ్ నిధుల విడుదల కోసం అడుగుతాను. నగరంలో ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఉప్పుటేరుపై మూడో బ్రిడ్జి నిర్మాణం, జనావాసాల మధ్య గల డంపింగ్ యార్డు తరలించేందుకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు, జగన్నాథపురంలో అదనపు తాగునీటి ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తాను. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు అంశాలను తెలియజేస్తా..

వనమాడి కొండబాబు, ఎమ్మెల్యే, కాకినాడ సిటీ నియోజకవర్గం
– కాకినాడ సిటీ



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తా..

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో ప్రజల తరపున గళం విప్పే అవకాశం కోసం ఎంతో ఆతృంగా ఎదురు చూస్తున్నా. గ్రామాల్లో ఎక్కడికక్కడ అస్తవ్యస్త డ్రైనేజీలు, రోడ్లు, శిథిలావస్థకు చేరడంతో మురుగునీరు ఎక్కడికక్కడే వీధుల్లో, రోడ్లపై నిలిచిపోతుంది. కోట్లాది నిధులతో జలజీవన్ పథకంలో పనులు చేసినా మత్స్యకార గ్రామాలతో పాటు ఇతర గ్రామీణ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, సాధ్యమైనంత మేర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ లతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తా.

పంతం నానాజీ, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్
– సర్పవరం జంక్షన్



ఇరిగేషన్ ప్రాజెక్టుల పెండింగ్ అంశాలపై మాట్లాడతా

ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో అధ్వాన్నంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల సమస్యలు అసెంబ్లీ దృష్టికి తీసుకువెళతాను. సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్, ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టులు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ ప్రాజెక్టుల ఆధునికీకరణ, సాగునీటి వ్యవస్థ అభివృద్ధి వంటి సమస్యలు పరిష్కారానికి సంబంధించిన అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. అలాగే నియోజకవర్గంలోని రహదారులు దెబ్బతిని మరమ్మత్తులకు గురయ్యాయి. అలాగే ఏలేశ్వరం అప్పన్నపాలెం వంతెన రెండేళ్ల క్రితం కూలిపోగా ఆ వంతెన నిర్మాణం అవసరాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తా..

వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్యే ప్రత్తిపాడు
– ప్రత్తిపాడు



రహదారుల దుస్థితిని అసెంబ్లీ దృష్టికి తీసుకెళతా..

గత వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో రహదారులకు కనీస మరమ్మతులు చేయక పెద్దాపురం నియోజకవర్గంలో పలు రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. మొదటి అసెంబ్లీ సమావేశాలలో తనకు ప్రశ్నోత్తరాల సమయంలో అవకాశం వస్తే రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుకు సంబంధించి అసెంబ్లీలో ప్రస్తావిస్తా. వివిధ గ్రామాల్లో లింక్ రోడ్లతో పాటు పలు గ్రామాలకు పట్టణాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారుల దుస్థితిపై సర్వే చేయించాను. సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా..

నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే, పెద్దాపురం
– సామర్లకోట



శ్రీపాదశ్రీవల్లభకు పూజలు

గురుపౌర్ణమిని పురస్కరించుకుని పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు.. వివరాలు..7లో

నేడు పిఠాపురంలో గ్రీవెన్స్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 21: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం మండల స్థాయిలో పిఠాపురం రథాలపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు ఉదయం 9.30 నిమిషాలకు పిఠాపురం రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదిక కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు జరుగుతుందన్నారు.



పిఠాపురంలో కురుస్తున్న జల్లులు

రోజంతా వాన

పిఠాపురం, జూలై 21: జిల్లా వ్యాప్తంగా ముసురు ఆదివారం కూడా కొనసాగింది. రోజంతా జల్లులు కురిసాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. ముసురు వాతావరణం, ఆపై సెలవు కావడంతో రోడ్లపై జనసంచారం అంతంత మాత్రంగానే ఉంది. పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోయింది. మరోవైపు నారుమడులు, వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేసిన పొలాలు ఇంకా వర్షపు నీటి ముంపులోనే ఉన్నాయి. వర్షం తగ్గే సూచనలు కనబడకపోవడంతో పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట చేలు మునక



యు.కొత్తపల్లి శివారులో నీట మునిగిన వరి చేను

రంగరాయ పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



గ్యాలరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

జీజీహెచ్ (కాకినాడ), జూలై 21: రంగరాయ వైద్య కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ పూర్వ విద్యార్థులు చేస్తున్న అభినందనీయమని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో ఆధునికీకరించిన పేరా క్లినికల్ లెక్చరర్ గ్యాలరీని ఆదివారం కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నరసింహంతో కలిసి కామినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆర్ఎంసీలో వైద్య విద్యనభ్యసించిన వైద్యులకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వైద్య విద్యాభ్యాసం చేసిన వారు కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంసీ 1980వ బ్యాచ్ లీడర్ డాక్టర్ గురునాథరావు అధ్యక్షతన ముఖ్య అతిథి, విశిష్ట అతిథులకు జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ వాగ్దేవ రవి, రామ్‌కోస ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీ ఆనంద్, సెక్రటరీ డాక్టర్ నున్న ఆదిత్య సత్య ప్రసన్న, డాక్టర్ వార వెంకట్రావు, డాక్టర్ శేషగిరి రావు, డాక్టర్ జీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ లక్ష్మీనారాయణతో పాటు 1980 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





క్యూలో భక్తులు

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

పెద్దాపురం, జూలై 21 : మరిడమ్మ జాతరకు ఆషాఢమాస మూడో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో పలు ఏర్పాట్లు చేశారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

శాకంబరీ నమో..నమః



శాకంబరి అవతారంలో తలుపులమ్మ అమ్మవారు



కిటకిటలాడిన లోవ

ఆషాఢ ఆదివారం కావడంతో పోటెత్తిన భక్తులు

తుని రూరల్, జూలై21: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం తలుపులమ్మ అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులను అనుగ్రహించారు. వేకువ జాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమలాపురానికి చెందిన అర్లపల్లి శివ 3 టన్నులకు పైగా కూరగాయలు అమ్మవారికి సమర్పించడంతో అమ్మవారితో పాటుగా ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలతో అలంకరించారు.పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ ప్రాంగణంలో చండీ హోమ క్రతువును పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొని పూజలు ఆచరించారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గతులు, వంట షెడ్డుల్లో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆలయానికి రూ.4.99 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ ఈవో విశ్వనాథరాజు ఆలయ అధికారులతో కలిసి ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో వాహనాల రద్దీ నెలకొంది. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 100 మందికి పైబడి బందోబస్తు నిర్వహించారు. తుని రూరల్ పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టారు.

గోదావరి ఉగ్రరూపం



ధవళేశ్వరం వద్ద గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

- కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లు ఎత్తివేత
- 8,63,535 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా..
- చింతూరువద్ద శబరి నీటి మట్టం 39 అడుగులు
- భద్రాచలంవద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ఎటు చూసినా వరద నీరే ● నిలిచిన రాకపోకలు

ధవళేశ్వరం, జూలై 21: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద ప్రవాహానికి తోడు దిగువన కుంట వద్ద ఉపనది శబరి నుంచి వరదనీరు గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా నీటిమట్టం పెరుగుతోంది. దీంతో కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను పూర్తిగా ఎత్తివేసి(ఆల్‌క్లియర్ పొజిషన్) ఎగువ నుంచి వస్తున్న నీటిని వస్తున్నట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి 12 గంటలకు కాటన్ బ్యారేజ్ నుంచి 8,63,535 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఈ సమయంలో నీటిమట్టం 10.80 అడుగులుగా నమోదైంది. నీటి మట్టం వేగంగా పెరుగుతుండడంతో సోమవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు నీటిమట్టం చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద ఆదివారం రాత్రి 12 గంటలకు 45 అడుగులకు నీటిమట్టం చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు చింతూరు ఆర్డీవో సంబంధిత అధికార్లకు గోదావరి-శబరివరదల పేరిట సమాచారంఅధికారికంగా అందించారు.

ఏజెన్సీలో ఎడతెరపిలేని వాన

- విలీన మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే శిరీషాదేవి
- పునరావాస ఏర్పాట్లు చేస్తున్నాం : ఐటీడీఏ పీవో



భద్రాచలం చింతూరు జాతీయ రహదారిపై చేరిన వరద నీటిలో చిక్కుకున్న లారీ

చింతూరు, జూలై 21: విలీన మండలాల్లో ఆదివారం రోజంతా చినుకులు పడుతూనే ఉన్నాయి. ఆదివారం ఉదయానికి చింతూరు మండలంలో 48.4 మిల్లీమీటర్లు, కూనవరం 14.8 మిల్లీమీటర్లు, ఎటపాక మండలంలో 15.6 మిల్లీమీటర్లు, వరరామచంద్రపురం మండలంలో 18.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకోగా, భద్రాచలంవద్ద గోదావరి సాయంత్రం ఏడుగంటలకు 43 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ఎగువన వర్షాలు కురుస్తుండడంతో భద్రాచలంలో గోదావరి 48 అడుగుల వరకు చేరుకొనే పరిస్థితి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. చింతూరు మండలంలో కల్లేరు, ఏజీ కొడేరు, ముకునూరు, రామన్నపాలెం, పెద్దసీతనపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు దిగ్బంధమయ్యాయి. వరరామచంద్రపురం మండలంలో సీతంపేట, శ్రీరామగిరి, చిన్నమట్టపల్లి, కన్నాయిగూడెం, తుష్టివారి గూడెం, అడవివెంకన్నగూడెం తదితర గ్రామాల నడుమ రహదారులపై వరదనీరు చేరడంతో అటుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంత ప్రజలు నాటు పడవలను ఆశ్రయిస్తున్నారు. కూనవరం మండలంలోని కొండ్రాజుపేట టేకులబోరుల నడుమ రహదారిపై వరద నీరు చేరడంతో దాదాపు 15 గ్రామాలకు నేరుగా ఉన్న రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రాంతవాసులు చుట్టూ తిరిగి మండల కేంద్రమైన కూనవరం చేరుకుంటున్నారు. ఎటపాక మండలంలోని నెల్లిపాక వీరాయిగూడెం గ్రామాల నడుమ రహదారిపై వరదనీరు చేరింది. ఇదే మండలంలోని గన్నవరంలో వర్షం ధాటికి రెండు పెంకుటిళ్లపై పై కప్పు కూలింది. చింతూరులో సంతపాకల ప్రాంతంలో వరద నీరు చేరింది. దీంతో చింతూరు ఒడ్డువాసులు ఇళ్లు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ఎమ్మెల్యే శిరీషాదేవి ఆదివారం విలీన మండలాల్లో పర్యటించారు. ఈ మేరకు వరద పరిస్థితిపై ఆమె ఆరా తీశారు. పలువురు ముంపు బాధితులు తమకు టార్పాలియన్లు ఇవ్వలేదన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన టార్పాలియన్లతోపాటు ఇతరత్రా సదుపాయాలను కల్పించాల్సిందిగా సూచించారు. భద్రాచలం చింతూరుల నడమ రహదారిపై వరదనీరు చేరింది. అదేదశలో చింతూరు మీదుగా చత్తీస్‌గడ్ వెళ్లే రహదారిపై సుక్మా జిల్లా ఎర్రబోరువద్ద, చింతూరు మీదుగా ఒడిస్సాకు రహదారిపై కయుగూరు వద్ద వరద నీరు చేరడంతో చత్తీస్‌గడ్, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మారేడుమిల్లి, చింతూరు ఘాట్ రహదారిపై వర్షం ధాటికి చెట్లు విరిగి పడుతుండడంతో ఆ దిశగా రాకపోకలు కూడా కష్టతరంగా మారాయి. డొంకరాయి జల విద్యుత్‌కేంద్ర రిజర్వాయరు సామర్థ్యం 1037 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1023 అడుగులకు చేరుకుంది.



వరద నీటిలో ఇళ్ళకు చేరుకుంటున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థినీలు

వరద నీటిలోనే ఇళ్ళకు విద్యార్థినులు

చింతూరు, జులై 21: పాఠశాలలకు సెలవులు కేటాయించడంతో పలువురు విద్యార్థులు వరద నీటిలో ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం ఈ ఘటన చింతూరులో చోటుచేసుకుంది. వరరామచంద్రపురం మండలంలోని సున్నవారిగూడెం ఆశ్రమ పాఠశాలతో పాటు కూనవరం మండలంలోని ఆదిమ గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులను ఈ రోజు వారి ఇళ్లకు వెళ్లాల్సిందిగా సంబంధిత వసతి గృహ హెడ్‌మాస్టర్, ప్రిన్సిపాల్‌లు సూచించారు. దీంతో విద్యార్థులు పలువురు వయా చింతూరు మీదుగా వారి ఇళ్ళకు చేరుకోవాల్సి వచ్చింది. కాగా వారంతా నీటమునిగిన 30 నెంబరు జాతీయ రహదారి మీదుగా ఇళ్ళకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదభరితమైన ఈ తరహా ప్రయాణం సరికాదంటూ సోషల్‌మీడియాలో పలువురు పాఠశాలల బాధ్యుల తీరుపై పెదవి విరిచారు. వారి తల్లిదండ్రుల అభీష్టం మేరకే, అదే దశలో వారి తల్లిదండ్రులతో పాటే తాము ఇళ్ళకు వెళ్లేందుకు విద్యార్థులకు అనుమతి ఇచ్చామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపల్ చెప్పుకొస్తున్నారు. ఈ విషయమై చింతూరు ఏటీడబ్ల్యూవో (అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి) సుజాతను ఆంధ్రజ్యోతి వివరణ కోరారు. ఈ మేరకు స్పందించిన ఏటీడబ్ల్యూవో సుజాత మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు వారి ఇళ్ళకు వరద నీటిమీదుగా చేరినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సిందిగా సూచించడం జరిగిందని కాగా ఈ విధంగా వరద నీటిమీదుగా ఇళ్లకు పంపించాలన్న ఆదేశాలు ఏ మాత్రం ఇవ్వలేదని ఈవిషయమై పూర్తిస్థాయిలో సమాచారం తీసుకుంటామన్నారు.



గేటు వద్ద మునిగిన ఇసుక నావ, క్రేన్ సహాయంతో నావను లాగుతున్న దృశ్యం



బ్యారేజ్ వద్ద ఇరుక్కున్న డ్రెడ్జింగ్ పడవ

- శనివారం రాత్రి గాయత్రి ర్యాంప్ నుంచి కొట్టుకొచ్చిన పడవ
- బ్యారేజ్ ఒకటో గేటు వద్ద నీట మునక
- పడవను బయటకు తీసే ప్రయత్నాలు విఫలం
- పనులు నిలిపివేత.. నేడు మళ్లీ ప్రయత్నం

ధవళేశ్వరం, జూలై 21: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద డ్రెడ్జింగ్ పడవ ఇరు క్కుపోయింది. గాయత్రి ఇసుక ర్యాంపు వద్ద లంగరువేసిన డ్రెడ్జింగ్ పడవ లంగరుతాడు తెగి గోదావరిలో వరదనీటి వేగానికి కొట్టుకు వచ్చి కాటన్ బ్యారేజ్ ఒకటవ గేటుకు అడ్డంగా మునిగిపోయి గేటును నియంత్రించడానికి అడ్డంకిగా మారింది.శనివారం రాత్రి 10 గంటల సమయంలో నీటిపై తేలుతూ బ్యారేజ్ వద్దకు కొట్టుకువచ్చిన పడవను ఇరిగేషన్ లస్కర్లు గుర్తిం చి అధికారులకు సమాచారం అందించారు. ఆ సమయంలో పడవ సొంత దారులు వచ్చి ఆ ప్రాంతంలోని గేట్లను దించితే ఒడ్డుకు లాక్కుంటామని కోరారు. గోదావరి ఉధృతంగా ఉండడంతో వల్ల రాత్రి సమయంలో గేట్లను దింపడానికి అధికారులు నిరాకరించారు. పడవ గేట్ల వద్ద కాంక్రీట్ పిల్లర్‌ను ఢీ కొనడంతో కన్నం పడి నావలోకి నీరు చేరి ఆదివారం ఉదయానికి గేటుకు అడ్డంగా మునిగిపోయింది. ఆదివారం ఉదయం స్థానిక మత్స్యకారులు సహాయంతో నావను బయటకు లాగడానికి ఇరిగేషన్ అధికారులు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. దీంతో కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాలతో ఎన్డీఆర్ఎఫ్ బృందంవచ్చి పరిశీలించింది. సాయంత్రానికి భారీ క్రేన్‌ను రప్పించి పడవను బయటకు తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. చీకటి పడడంతో పనులు నిలిపివేశారు.నీటమునిగిన పడవ ఖరీదు రూ.15 లక్షలు ఉంటుందని సమాచారం.సోమవారం ఉదయం పడవను బయటకు తీసే పనులు చేపట్టనున్నారు.

నీట మునిగిన గండి పోశమ్మ ఆలయం

దేవీపట్నం, జూలై 21: మండలంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన కొండమొదలు, తాళ్యారు, కచ్చులూరు, మంటూరు, మడిపల్లి, మూలపాడు, అగ్రహారం, దేవీపట్నం, తొయ్యేరు, పూడిపల్లి, పోశమ్మగండి గ్రామాల్లో వరద నీరు పెరుగుతూ వస్తోంది. గత మూడు రోజుల నుంచి మాతృశ్రీ అమ్మవారి ఆలయాన్ని చుట్టుముట్టి ఆదివారం గోపురం పైభాగం వరకు వరదనీరు చేరింది. తాలిపేరు జలాశయం, శబరి తదితర నదుల నుంచి గోదావరికి వరదనీరు చేరి సీతపల్లి వాగు పోటెత్తడంతో నాలుగు పంచాయతీలకు ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

శాకంబరిగా రత్నగిరి దుర్గలు



శాకంబరి అలంకారంలో దర్శనమిస్తున్న వనదుర్గ

అన్నవరం, జూలై 21: ఆషాఢపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని రత్నగిరి రక్షకిలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గ, గ్రామదేవతలైన నేరేళ్లమ్మ, మరిడమ్మ, వాసవీమాతలు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవార్లను దేవస్థానం ఆధ్వర్యం లో అయా ఆలయ కమిటీల పర్యవేక్షణలో వివిధ రకాలైన కూరగాయలతో అలంకరించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి కరువు కాటకాలు దరిచేరకూడదని ఈ శాకంబరి అలంకారం నిర్వహిస్తుంటారు.

వైభవంగా సత్యదేవుడి మహావ్రతం



సప్తవర్ణ శోభిత బీజాక్షరాలతో భారీ మహానారాయణ యంత్రం

అన్నవరం, జూలై 21: సత్యదేవుడి సన్నిధిలో స్వామివారి మహావ్రతం ఆదివారంతో ముగిసింది. శనివారం ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. దేవస్థానంతో సంబంధం లేకుండా అవదూత దత్తమణి పర్యవేక్షణలో దీనిని నిర్వహించారు. 116మంది రుత్విక్‌లతో 333 చదరపు అడుగుల విస్తీర్ణంలో వృత్తాకారంలో భారీ మహానారాయణ యంత్రాన్ని వివిధ మంత్రోచ్చరణలతో ఏర్పాటుచేసి సప్తవర్ణశోభితంగా అలంకరించి పూజలు నిర్వహించారు. 1500గ్రాముల వెండి అష్టలక్ష్మి కలశం మధ్యలో ఉంచి పూజలు చేశారు. అనంతరం ఈ కలశాన్ని దేవస్థానంకు బహూకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. గోత్రనామాలతో కాకుండా లోకకల్యాణమే హద్దుగా నిర్వహించామని దీనివలన క్షేత్రవృద్ధి జరుగుతుందన్నారు.

70 వేల ప్యాకెట్ల సత్యదేవుడి ప్రసాదం విక్రయాలు

తులపులమ్మ లోవ దర్శనానికి వెళ్లి తిరుగుప్రయాణంలో వెళ్లే ఉమ్మడిగోదావరి జిల్లాల లోవ భక్తులు ఆదివారం జాతీయరహదారిపై నమూనాలయం, తొలిపావంచా వద్ద సత్యదేవుడి ప్రసాదాలు కొనుగోలు చేయడంతో రద్దీ నెలకొంది. ఆదివారం ఒక్కరోజు కొండదిగువన కొండపైన సుమారు 70వేలప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు.

కేంద్ర పర్యాటక శాఖ మంత్రితో దుర్గేష్ భేటీ

- రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిపై చర్చ



కేంద్ర మంత్రి గజ్రేంద సింగ్ షెకావత్‌కు పుష్పగుచ్ఛంద అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 21: రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా పలు ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై కేంద్ర పర్యాటక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను ఢిల్లీలో కలిసినట్టు రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధిపై చర్చించినట్టు చెప్పారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి పలు ప్రాజెక్ట్‌లు చేపట్టేందుకు అనువైన ప్రదేశాలున్నాయని తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని దుర్గేష్ అన్నారు. ఇదిలావుండగా ఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కాల్ కాన్ఫరెన్స్ నిర్వహించి నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో అధిక వర్షాలు వరదలపై జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి నుంచి జిల్లా యంత్రాంగం వరకు ప్రజలకు అందు బాటులో ఉంటూ పునరావాస కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

న్యాయవాదులు వృత్తిలో నిబద్ధతతో పనిచేయాలి

- టీఎస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావునాయుడు



జస్టిస్ సాంబశివరావు నాయుడును సత్కరిస్తున్న బార్ అసోసియషన్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21: న్యాయవాదులు వృత్తిలో నిబద్ధతతో పనిచేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనం, బుచ్చిరాజు కల్యాణవేదికలో ఆదివారం రామచంద్రపురం బార్ అసోసియేషన్ సభ్యుడి నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన జస్టిస్ సాంబశివరావు దంపతులను బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జస్టిస్ సాంబశివరావు మాట్లాడుతూ తాను స్వర్గీయ సీనియర్ న్యాయవాది పిల్లా జానికిరామయ్య వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశానన్నారు. ముఖ్యఅతిథి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రవి చీమలపాటి మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాలు ఇస్తున్న తీర్పులను అధ్యయనం చేయాలన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ కళాశాల వైస్ చాన్సలర్ డాక్టర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ భారతదేశ న్యాయవ్యవస్థ విశిష్టమైనదన్నారు. సమావేశంలో జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడారు. సీనియర్ న్యాయవాదులు నాగబాబు, ఉండవల్లి గోపాలరావులు జస్టిస్ సాంబశివరావును న్యాయవాదులకు పరిచయం చేశారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి అధ్యక్షతన జరిగిన అభినందన సభలో కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్ విశిష్ట అతిథులను ఆహ్వానించారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా జడ్జి డి.ఎల్.కామేశ్వరి, హైకోర్టు సీనియర్ న్యాయవాది సార్వభౌమారావు, జిల్లా అదనపు జడ్జి ఎం. మాధురి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జిలు నిజాం శారద, నాగేశ్వరరావు నాయక్, బార్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, డీఎస్ఎస్ శర్మ, సత్యవాణి, సీనియర్ న్యాయవాదులు మల్లిడి హరినాదరెడ్డి, ముషిని సర్వారాయుడు, పోలిశెట్టి శ్రీనివాస్, జయశంకర్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నిండు ప్రాణాలు తీసిన..మద్యం మత్తు

- నిందితుడు పాత నేరస్తుడు



పీతా దుర్గా సతీష్, చాట్ల నాగ లక్ష్మణ్ కుమార్‌ల మృతదేహం, ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటోలు

కాకినాడ క్రైం, జూలై 21 : మద్యం మత్తే కొంప ముంచింది. మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనం నడపడంతో రెండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. శనివారం అర్ధరాత్రి కాకినాడ కల్పన సెంటర్లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదానికి మద్యం మత్తే మూలకారణంగా పోలీసులు గుర్తించారు. ఈ ఘోర ప్రమాదానికి ప్రధాన కారకుడుగా ఉన్న కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన చల్లా రామ్మోహన్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పేర్రాజుపేటకు చెందిన పీతా దుర్గా సతీష్ (31), జీజీహెచ్ వెనకాల నీలావారి వీధికి చెందిన చాట్ల నాగలక్ష్మణకుమార్ (34)లు అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా, వీరి వెనకాలే బైక్‌పై వెళుతోన్న రేచర్లపేటకు చెందిన దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయాలపాలై అపస్మారకస్థితిలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. రామ్మోహన్ ప్రస్తుతం వైజాగ్‌లో ఉంటున్నాడు. ఇటీవల కాకినాడ తండ్రి ఇంటికి వచ్చాడు. ఇక్కడకు వచ్చి కొత్త కారు కొనుగోలు చేశాడు. శనివారం రామకృష్ణారావుపేటలో స్థానికంగా ఉన్నవారితో ఇతను ఘర్షణకు దిగినట్లు తెలిసింది. మద్యం మత్తులో ఘర్షణకు పాల్పడి అక్కడి నుంచి కారులో యువతి పద్మతో కలసి కారులో కల్పన సెంటర్‌వైపు వేగంగా వచ్చాడు. ఈ క్రమంలో మద్యంమత్తులో ఎదురుగా వెళుతోన్న పీతా దుర్గా సతీష్ (31), చాట్ల నాగ లక్ష్మణకుమార్ (34)లను ఢీకొట్టాడు. అలాగే మరొక బైక్‌పై వెళుతోన్న దుర్గాప్రసాద్‌కు ఢీకొట్టగా, సతీష్, లక్ష్మణ్‌కుమార్‌ల శరీర అవయవాలు విడిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణం వేగంగా వెళుతోన్న క్రమంలో బ్రేక్ వేయబోయి, ఎక్స్‌లేటర్ రేజ్ చేయడంతో వీళ్లని ఢీకొట్టి డివైడర్‌ని ఢీకొట్టి పల్టీలు కొట్టి కారు బోల్తా పడింది. ఈ ఘోరప్రమాదం చోటుచేసుకుందని ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. రామ్మోహన్‌పై సుమారు 15 చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన సంఘటనా స్థలం వద్ద కారు డోర్ నుంచి బయటకు మద్యం బాటిల్స్ రోడ్డుపై పడ్డాయి. ఆదివారం పోలీసులు మార్చురీలో ఉన్న సతీష్, నాగలక్ష్మణ్‌కుమార్‌లకు పోస్టుమార్టమ్ నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మార్చురీ జరిగే సమయంలో బంధువుల ఆర్తనాదాలతో రోదనలు మిన్నంటాయి. తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్ ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రామ్మోహన్ కోలుకున్న అనంతరం విచారణ నిర్వహించడం జరుగుతుందని కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు తెలిపారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామికి లక్ష తులసి అర్చన, శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో స్వామికి సర్వపుష్పాలతో అలంకారం

దత్తనామస్మరణతో మార్మోగిన పిఠాపురం


- ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

పిఠాపురం, జూలై 16: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంతో పాటు అన్ని దత్తక్షేత్రాలు, సాయిబాబా ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. గురుపౌర్ణమి శోభ చేకూరింది. పాదగయలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష తులసి అర్చన నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ జరిగింది. భక్తులు ఆలయం చుట్టూ ప్రదిక్షణాలు చేసి ఔదంబర వృక్షంవద్ద పూజలు చేశారు. పాదగయ ఆవరణలోని అలక్‌నిరంజన్ దత్తబృందావనంలో లక్ష గులాబి అర్చన, లక్షతులసి అర్చన, విశేష పుష్పార్చనలు నిర్వహించారు. పల్లకిసేవ, ఊయలసేవ,సాయినాధునికి విశేష అలంకారం చేశారు. భారీ అన్న దానం నిర్వహించారు. దత్తగురువు వాడ్రేవు శ్రీనివాసరావు పూజాది కార్యక్రమా లు జరిపించారు. ఆలయఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీపాదవల్లభ సంస్థానంలో...

పట్టణంలోని శ్రీపాదవల్లభ మహాసంస్థానంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సర్వపుష్పార్చన జరిగాయి. దత్త హోమం నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయుడు, నృసింహసరస్వతులకు సర్వపుష్పాలంకారం చేశారు. ఉభయతెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు తరలివచ్చారు. ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలు కట్టి ప్రదిక్షణలు చేశారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ జరిగింది. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, లక్ష్మీదేవి దంపతలు ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య పాల్గొన్నారు.

వెటర్నరీ ఎన్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



ఆలమూరు, జూలై 21: ఏపీ వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్ ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా పినపళ్ల పశువైద్యాధికారి ఈదల శ్రీనివాస్‌చౌదరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఈదల శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యక్షులుగా కేవీ రామరాజు, రుక్మతరావు, అప్పన్నబాబు, సహాయ అధ్యక్షుడిగా ఎస్.వీర్రాజు, కార్యదర్శిగా సాంబమూర్తి, కోశాధికారిగా ఎం.రామారావు, సంయుక్త కార్యదర్శులుగా ఆర్. శ్రీనివాస్, ఆర్‌వీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

శెట్టిపేటలో వివాహిత హత్య



నిడదవోలు, జూలై 21: నిడదవోలు మండలం శెట్టిపేటకు చెందిన కురసాల నవ్య (28) ఆదివారం తెల్లవారుజామున హత్యకు గురైంది. మృతురాలి తండ్రి యరగం శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పెరవలి మండలం అన్నవరప్పాడుకి చెందిన నవ్యతో శెట్టిపేటకి చెందిన తాపీ పనిచేసే కురసాల చిరంజీవికి 12ఏళ్ల క్రితం వివాహమైంది.వారికి ముగ్గురు కుమార్తెలు గీతిక(10), తేజశ్రీ(7), జాహ్నవి(4) ఉన్నారు. నవ్యను చిరంజీవి అనుమానంతో వేధిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున టైలరింగ్ కత్తెరతో తన కుమార్తెను హత్య చేశాడని శ్రీనివాసు ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఈ సంఘటనపై నిడదవోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇగ్నో కోర్సుల్లో ప్రవేశానికి గడువు పెంపు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 21 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి (జూలై 2024 సెషన్) వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును జూలై 31వరకూ పొడిగించినట్టు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ తెలిపారు. యూజీసీ ద్వంద్వ డిగ్రీ ప్రోగ్రాంలకు ఆమోదం తెలిపిందన్నారు. దీని ద్వారా విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీలు చేయవచ్చని తెలిపారు. సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో ఈ నెలాఖరు వరకూ ప్రవేశాలు లభిస్తాయని తెలిపారు.

వాటర్ ట్యాంకులో పడి ఆపరేటర్ మృతి



సలాది రక్షణ ఆనంద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 21: కాకినాడ అర్బన్ 2వ డివిజన్ బొందగుంటలోగల విజయలక్ష్మి వాటర్ ప్లాంటులో గల వాటర్ ట్యాంకులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెంనకు చెందిన సలాది రక్షణ ఆనంద్ (40) కాకినాడ లచ్చిరాజువారి వీధిలో భార్య మాణిక్యాంబ, ఇద్దరు కుమారులతో నివసిస్తున్నాడు. ఇతను బొందగుంటలో గల విజయలక్ష్మి వాటర్ ప్లాంటులో ఆపరేటర్ కమ్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి 8గంటలకు విధుల్లో చేరాడు. వాటర్ ప్యూరిఫికేషన్ ప్రక్రియలో నీటిని పరీక్షించేందుకు వాటర్ ట్యాంకులోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందినట్లు నిర్వాహకులు మృతుడు తండ్రి రాజేశ్వరరావు, పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. తండ్రి సంఘటనా స్థలానికి చేరుకుని కుమా రుడు మృతదేహం చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు. భార్య, ఇద్దరు కుమారులకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి న్యా యం చేసే వరకు మృతదేహన్ని పోస్టుమార్టమ్‌కి తరలించేదిలేదని ఆందోళన చేశారు. సంఘటనా స్థలానికి సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, ప్రమాదానికిగల కారణాలపై వివరాలు సేకరించారు. మృతుని తండ్రి రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేయాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. వాటర్ ప్లాంటు శుద్ధి చేసేందుకు అనుమతులపై ఉభయ గోదావరి జిల్లాల ఫ్యాక్టరీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడగా ఎటువంటి ప్లాంటు ఏర్పాటుకు అనుమతులు లేవని, క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సోమవారం అధికారులను పంపిస్తానని సదరు అధికారి ఎమ్మెల్యేకు చెప్పారు. ఈ సందర్భంగా బంధువులు, నిర్వాహకుల మధ్య చర్చలు జరిపి నష్టపరిహారం అందించేందుకు అంగీకరించడంతో మృతదేహాన్ని తరలించారు.

భార్య రొయ్యలకూర వండలేదని.. భర్త ఆత్మహత్య

గొల్లప్రోలు, జూలై 21: భార్య చెప్పిన కూర వండలేదని కోపగించిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా చికిత్సకు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం రంగప్పచెరువు ఏరియాకు చెందిన బండి బుచ్చిరాజు(25), దుర్గాభవానీకి అయిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. స్థానికంగా ఉన్న రైతు కమతంలో పనిచేసే బుచ్చిరాజు శనివారం రాత్రి ఇంటికి వచ్చి తనకు ఆకలి వేస్తుందని తొందరగా భోజనం పెట్టమని అడిగాడు. ఏమి కూర వండావని అడగగా, కోడిగుడ్లు కూర వండుతున్నానని భార్య దుర్గాభవానీ చెప్పింది. తాను ఉదయం వెళ్లేటప్పుడు రొయ్యలకూర వండమంటే ఈ కూర ఎందుకు వండుతున్నావంటూ పొయ్యి మీద కూర పాత్రను గెంటేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో నూకరాజు ఇంటి నుంచి కోపంగా వెళ్లిపోయాడు. రాత్రి 11గంటల సమయంలో తన భర్త నూకరాజు ఇంటికి వచ్చి లోపలకు వెళ్లి తలుపు వేసుకున్నాడని, చూస్తే ఏదో తాగుతున్నట్లు అనిపించడంతో ప్రశ్నించగా పురుగుల మందు తాగినట్లు చెప్పాడని భార్య దుర్గాభవానీ పోలీసులకు తెలిపింది. దీంతో తన తల్లి సహాయంతో వెంటనే కుంకుడుకాయ రసం తాగించగా వాంతు చేసుకోగా, అక్కడి నుంచి పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో చనిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 21: సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని 0884 2357800కు సమస్యలు చెప్పవచ్చన్నారు.

దశ, దిశ నిర్ణయించేది గురువు : ఉమర్‌ఆలీషా


కుట్టుమిషన్లు పంపిణీ చేసిన ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జూలై 21: మానవుని జీవన విధానానికి దశ, దిశ నిర్దేశించేది గురువు అని, పురాతనమైన భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులు, గురువుకు విశిష్ట స్థానముందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఆదివారం జరిగిన సభలో ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ఆధ్యాత్మిక జ్ఞానమార్గంలో మానవతా విలువలు పెంపొందించుకుని సమాజంలో సుఖసంతోషాలతో జీవనం సాగించాలన్నారు. ఇహానికి అవసరమైన భుక్తి, తృప్తి, ముక్తి లభింపచేసేదే త్రయాసాధన అని తెలిపారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంటు ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు అందజేశారు. పక్షులకు ఆహారంగా ధాన్యపు కుచ్చులను పంపిణీ చేశారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉమర్‌ఆలీషా ప్రారంభించారు. పలువురు రక్తదానం చేశారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, వాసిరెడ్డి ఏసుదాసు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, అహ్మద్ ఆలీషా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గరాజు, మునిసిపల్ కమిషనరు కనకారావు దంపతులు, సీఐ శ్రీనివాస్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్‌టీవీ ప్రసాదవర్మ, ఏవీవీ సత్యనారాయణ, డాక్టర్ పి.ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురువులు మార్గనిర్దేశకులు : ఎమ్మెల్యే నానాజీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్, జూలై 21: గురువులు సమాజానికి మార్గనిర్దేశకులని, వారు ఎక్కడ పూజింపబడతారో అది సరస్వతీ నిలయంగా మారుతుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. యంగ్ మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ శ్రీనగర్‌లోని కార్యాలయంలో విద్యార్థులకు ఐఐటీ చదువులు, యువతకు పోటీ పరీక్షలు, ఉద్యోగావకాశాలు, కెరీర్‌గైడెన్స్ వంటి అంశాలపై అగాహన ఆదివారం కల్పించారు. ఎమ్మెల్యే నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థ చేపట్టబోయే 6అంశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులంతా అవగాహనా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగంచేసుకోవాలన్నారు. సంస్థ లక్ష్యాలను వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ వివరించారు. కార్యక్రమంలో సంస్థ యూత్ ఐకాన్ వనమాడి మోహన్, నరాల కృష్ణకుమార్, వైడీ రామారావు, తిలక్‌బాబు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జూలై 21: గత 3రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశించారు. అల్పపీడనం కారణంగా నియోజకవర్గంలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో వర్షాల ప్రభావంతో కొన్ని చోట్ల వాగులు వంకలు ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే దివ్య మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

'ఆ 6 గ్రామాల రికార్డులను వెనక్కి తీసుకోవాలి'

కాకినాడ రూరల్, జూలై 21: గవర్నర్ ఆర్డినెన్స్‌తో విలీనమైన చీడిగ, ఇంద్రపాలెం, తూరంగి, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి తదితర 6 గ్రామాల రికార్డులను కాకినాడ కార్పొరేషన్ వెనక్కి తీసుకోవాలని చీడిగ పౌరసదస్సు డిమాండ్ చేసింది. పౌరసంక్షేమసంఘం పిలుపుమేరకు చీడిగ సచివాలయంలో జుత్తుగ శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాజీసర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామంలోని ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. 13 ఏళ్లుగా విలీనం కాకుండా అడ్డుపడిన వ్యవస్థల దుస్థితిని ప్రస్తావించారు. పౌరసంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే నానాజీ ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల ముందు ఐక్యకార్యాచరణ జరిగిన రీతిగా ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు పోస్టుకార్డు ఉద్యమం, సీఎం కార్యాలయానికి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు శ్రీనివాసరావు, మహేష్, నాగబాబు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, శాస్త్రి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన లోకేశ్ ఫౌండేషన్ సభ్యులు

కాకినాడ సిటీ, జూలై 21: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదివారం నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిసి ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. నారా భువనేశ్వరి పుట్టినరోజు పురస్కరించుకుని ఫౌండేషన్ ద్వారా లక్ష మొక్కలు నాటే కార్యక్రమం పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొర్ల కిరణ్‌కుమార్, రూరల్ అధ్యక్షుడు మండపాక నాగబాబు, ప్రత్తిపాడు అధ్యక్షుడు అడపా జగదీష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

పెద్దాపురం, జూలై 21: స్థానిక మరిడమ్మ దేవస్థానంలోచండీహోమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 700 శ్లోకాలతో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల పర్యవేక్షణలో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. ప్రజలకు సకల శుభాలు, కార్యాలు నెరవేర్చేందుకు ఈ హోమం నిర్వహిస్తారని పండితులు తెలిపారు. హోమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి పుష్పపూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, వేదపండితులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

సామర్లకోట, జూలై 21: సామర్లకోట వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయం ఆవరణలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం శ్రీశాంతి గురుదేవ్ ఆశీస్సులతో భవర్‌లాల్ జైన్ కుటుంబ సభ్యుల సౌజన్యంతో 16వ ఉచిత నేత్ర వైద్య శిబిరం సుమిత్ జైన్, అమిత్ జైన్ సోదరుల సౌజన్యంతో నిర్వహించారు. డాక్టర్ గీత, డాక్టర్ శ్రీవల్లీ తదితర వైద్యబృందం 260మందికి పరీక్షలు చేసి వారిలో శస్త్ర చికిత్సలకు అర్హులైన 120 మందిని ఎంపిక చేసి కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమానికి ప్రోగ్రాం మేనేజర్ సత్యనారాయణ తదితరులు సేవలందించారు. ఏటా గురుపౌర్ణమి రోజున పేదలకు ఉచిత నేత్ర వైద్యశిబిరాలు నిర్వహణ కొనసాగిస్తామని సుమిత్, అమిత్ తెలిపారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

కాకినాడ సిటీ, జూలై 21: స్థానిక జగన్నాథపురంలోని శివాలయం పునర్నిర్మాణానికి భక్తులు ముందుకు రావాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. ఆదివారం శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ట్రస్ట్ సభ్యులకు ది కాకినాడ వెండి, బంగారం వర్తక సఘం అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ రూ.99 వేలు చెక్కును ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం అందజేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కామాడి దశరథ, మేడిశెట్టి చిన్ని పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కరప, జూలై 21: వేళంగి మెర్లాస్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఘనంగా జరిగింది. స్థానిక పాఠశాలలో 1977-78, 1978-79 బ్యాచ్‌లకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒక్కచోట కలిసి సందడి చేశారు. పూర్వ విద్యార్థులు మార్ని నారయ్యచౌదరి, రావుల సత్యం, పాత్రుని నరసింహరావు, డాక్టర్ లకమన సాయినాథ్‌రావు, రావుల వేణుగోపాలరావు, తలాటం భాస్కరరావు, కుంచే సాంబమూర్తి ఉల్లాసంగా గడిపారు. ఆనాటి గురువులు వెలుగుబంట్ల గోపాలకృష్ణ, గొట్టుముక్కల నరసింహశాస్త్రి, ఎన్‌వీ రామారావు, మీనాక్షి, రావుల సత్తిరాజు, మూర్తి, దాసులను ఆహ్వానించి పాదపూజతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఇదే పాఠశాలలో పూర్వ విద్యార్థి, టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, డాక్టర్ బొండా వెంకన్నరావు, మెర్ల వీరయ్యచౌదరి, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

» సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు

» ఆలయాల వద్ద అన్న సంతర్పణలు



గొల్లప్రోలు మండలం చేబ్రోలు బాబా ఆలయంలో భక్తులు, సామర్లకోట:వేట్లపాలెంలో ఎమ్మెల్యే రాజప్ప పూజలు

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 21: నగరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం టూటౌన్ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చాక్లెట్ రెడీమేడ్ షోరూమ్ అధినేత శ్రీరామ్, దాతల వితరణతో వచ్చిన 3 టన్నుల కాయగూరలతో బాబాను, దేవాలయ ప్రాంగణాన్ని అలంకరించారు. ఆలయ ప్రధాన ధర్మకర్త యూఎస్‌జీ రాజు (నాని) ఆధ్వర్యంలో భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. రామారావుపేటలోని కూచిపూడి నాట్యాలయంలో నాట్యాచార్య ఎస్.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం, గజ్జె పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులచే దత్తాత్రేయస్వామికి విశేష అభిషేకపూజల అనంతరం స్వామివారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. సామర్లకోట ఆంధ్రాసాయి గీతాసమాజం షిర్డీ సాయిబాబా ఆలయంలో విశేష పూజలు జరగగా ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పాల్గొన్నారు. వేట్లపాలెం షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అనూరాధ దంపతులు, కుమార్తె, మనుమ పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించి పండితులచే వేదాశీర్వచనం చేశారు. మాజీ జెడ్పీటీసీ గుమ్మళ్ళ విజయలక్ష్మీ రామకృష్ణ, గోలి ప్రీరామ్ చౌదరి, వల్లూరి పెద్ద పాల్గొన్నారు. అచ్చంపేటలో సాయిబాబా ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు.

గొల్లప్రోలు: పట్టణంలోని మెయిన్‌రోడులోని సాయిబాబా ఆలయం, కరణంగారితోటలో గల గొల్లపూడి ట్రస్టు షిర్డిసాయిమందిర్‌లో విశేషపూజలు జరిగాయి. ఈబీసీ కాలనీలోని లలితాదేవి మందిరంలో గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. చేబ్రోలులోని సాయిబాబా ఆలయంలో కాకడహారతి, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు జరిగాయి. సాయంత్రం విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

గండేపల్లి: మురారిలో సాయిబాబా ఆలయం వద్ద గద్దే అబ్బన్న ఆధ్వర్యంలో స్వామివారిని పల్లకీలో మహిళలు, షిర్డీసాయి సేవకులు భజన చేస్తూ గ్రామమంతా ఊరేగించారు. అదే గద్దే వెంకట సత్యనారాయణ చౌదరి దంపతులు వెంకటరావు జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు ఉండవిల్లి సత్యవేణి, పల్లెపూడి దుర్గభవానీ స్వామివారి సేవకులు, దివ్యాంగులు, సమాజ సేవకులకు సన్మానం చేసి నూతన వస్త్రాలతో సత్కరించారు. అన్నదానం చేపట్టారు. అలాగే సూరంపాలెంలో ఆదిత్య విద్యాప్రాంగణంలో విద్యాసంస్థల అధినేతలు నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం, వైస్‌ఛైర్మన్ సతీష్‌రెడ్డి, శృతిరెడ్డి, ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి, సుగుణరెడ్డి దంపతులు పీఠలపై కూర్చొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో, పట్టణంలో సాయిబాబా మెట్టమీద వేంచేసి యున్న షిర్డీసాయి బాబా ఆలయాల్లో అభిషేకాలు, సర్వపుష్పార్చన, తులసి అర్చన నిర్వహించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యప్రభకు ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు శాలువా కప్పి సత్కరించి బాబా ఫొటో అందజేశారు. సిరిపురం శ్రీషిర్డీసాయి మందిరానికి మనం సేవా ఫౌండేషన్ ఛైర్మన్ మానూరి లతా గంగరాజు కుటుంబ సభ్యులు ఇత్తడి నక్షత్ర హారతి పురోహితులకు అందజేశారు. భక్తులకు మహాన్నదానం చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ధనేకుల వీరభద్రరావు,కొమ్ముల కన్నబాబు,చిక్కాల లక్ష్మణరావు ఉన్నారు.

కొత్తపల్లి: ఉప్పాడ ఐశ్వర్యసాయి మందిరంలో భక్తులు సాయిబాబాకు పాలాభిషేకం, పూజలు నిర్వహించారు. మందిరం నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు. అనేక మంది భక్తులు స్వీకరించారు.

కిర్లంపూడి: జగపతినగరంలో షిర్డీసాయిబాబా ఆలయంలో, గెద్దనాపల్లి, తామరాడ పలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు

కోటనందూరు: కోటనందూరు, కెఇచిన్నయ్యపాలెం, బిళ్లనందూరు, బీమవరపుకోట తదితరగ్రామాల్లో సాయి బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

రౌతులపూడి: రౌతులపూడి పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. బలరాంపురంలో సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వమించారు.

తాళ్లరేవు: పి.మల్లవరం ముత్యాలమ్మ గ్రామదేవత ఆలయంలో అర్చకులు కందవల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ధూళిపూడి చిట్టిబాబు, పద్మశ్రీ దంపతులు పీఠలపై కూర్చుని పూజలు చేశారు. భక్తులు ముత్యాలమ్మకు పాలాభిషేకం, కుంకుమ పూజలు చేశారు.

పెద్దాపురం: పట్టణంలో స్థానిక కోర్టు వద్ద ఉన్న బాబా మందిరం, శివాలయం వీధిలో ఉన్న బాబా మందిరం, బస్ కాంప్లెక్స్, సుధా ఆగ్రో వద్ద, పాతపెద్దాపురం ప్రాంతాల్లో.. రూరల్‌లో కట్టమూరు, దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోట, ఆర్‌బీ పట్నం తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

తొండంగి:బెండపూడి షిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం ప్రభాత హారతి, అష్టోత్తర శత కలశాభిషేకం, అలంకరణ, మధ్యాహ్న హారతి అనంతరం విశేష పదార్థాలను నివేదించారు. సాయంత్రం హారతి పవళింపు సేవలు, బాబాకు విశేష అలంకరణ చేశారు. గోపాలపట్నంలో నేరేళ్ళమ్మను శాకాంబరిగా అలంకరించారు. తొండంగి దుర్గాదేవి ఆలయం వద్ద అన్నదానం జరిగింది.

పిఠాపురం: బైపాస్‌రోడ్డులో గల గోపాల్‌బాబా ఆశ్రమం, ఆర్టీసీ కాంప్లెక్సుకు వెళ్లే మెయిన్‌రోడ్డులోని సాయిబాబా ఆలయం, సినిమా సెంటర్‌లో రైల్వేస్టేషన్ రోడ్డులో గల షిర్డీసాయినాథ్ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయిబాబా ఆలయాల్లో అభిషేకాలు, పుష్పార్చన, పల్లకీసేవ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పలు హరతులు ఇచ్చారు. అగ్రహారంలో గల అనఘా దత్తక్షేత్రంలో అనఘాదత్త వ్రతాలు నిర్వహించారు. విశేష పూజలు జరిగాయి.

ప్రత్తిపాడు: రాచపల్లిసాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పూజలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు బుద్దరాజు గోపిరాజు, ఒమ్మంగి మాజీ సర్పంచ్ రామిశెట్టి మురళీకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు సుంకర రాజా పాల్గొన్నారు. ప్రత్తిపాడులోని పుట్టపర్తి సాయిబాబా ఆలయంలో భక్తులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి బాలలకు అన్నదానం నిర్వహించారు. స్థానిక చెక్‌పోస్టు సెంటర్ దుర్గమ్మ ఆలయం వద్ద గురుభవాని పత్రి రమణను సన్మానించారు. రౌతుపాలెం సాయిబాబా ఆలయం వద్ద సిగిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కరప: నడకుదురులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆధ్యాత్మిక వైజ్ఞానిక విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్ శ్రీ గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో కాకినాడ స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ప్రకృతి వైద్యుడు సద్గురు సచ్చిదానంద యోగి, ట్రస్టీ సభ్యుడు సదాశివం. ఆదికవి నన్న య్య విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు తరపట్ల సత్యానారాయణ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయప్రకాష్, కాకినాడ స్ఫూర్తి కుటుంబం సభ్యులు మాదవరపు వీరరాఘవరావు, గంగాభవానీ పాల్గొన్నారు.



కొత్తపల్లి:ఉప్పాడలో బాబాకు పాలాభిషేకం, తొండంగి: విశేష అలంకరణలో బెండపూడి సాయిబాబా


కరప: నడకుదురులో మాట్లాడుతున్న సద్గురు సచ్చిదానంద యోగి


కాకినాడలో సాయి బాబాను కాయ గూరలతో అలంకరించిన దృశ్యం

రత్నగిరిపై వ్యాసపౌర్ణమి వేడుకలు

అన్నవరం, జూలై 21: అన్నవరం దేవస్థానంలో ఆదివారం వ్యాసపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం దర్బారుమండపంలో వ్యాసభగవానుడి చిత్రపటం ఉంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వ్యాసమహర్షి చిత్రపటంతో మేళతాలాలతో ఆలయం లోపల ప్రదక్షిణ గావించారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, సూపరెంటెండెంట్ స్వామీజీ పాల్గొన్నారు.

కలుషిత జలాల సరఫరా నిలిపివేత

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


వన్నెపూడిలో తాగునీటి శాంపిల్స్ పరిశీలిస్తున్న అధికారులు

గొల్లప్రోలు రూరల్, జూలై 21: గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో కుళాయిల ద్వారా కలుషిత జలాలు సరఫరా కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వన్నెపూడిలో కుళాయిల ద్వారా రంగుమారిన కలుషిత జలాలు వస్తున్నాయని, దీని వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్, డీపీవోలు వివరణ కోరారు. దీంతో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో పైపులైన్లు, గ్రామానికి సరఫరా అవుతున్న నీటి సరఫరాను పరిశీలించి తనిఖీలు చేపట్టారు. కొడవలి బోరు ద్వారా వన్నెపూడి గ్రామానికి మంచినీరు వచ్చే పైపులైన్లుకు 16వ జాతీయరహదారి కింద లీకులు ఉన్నట్టు గుర్తించారు. తక్షణం ఇక్కడ నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. వారంరోజుల్లోగా పైపులైన్లకు మరమ్మతులు నిర్వహిస్తామని, మల్లవరం తాగునీటి సరఫరా పథకం ద్వారా నీటి సరఫరా పెంచుతున్నామని గొల్లప్రోలు ఈవోపీఆర్డీ కుమార్ పేర్కొన్నారు.

పెరిగిన నీటి మట్టం


సుబ్బారెడ్డి సాగర్‌లో పెరిగిన నీటి మట్టం దృశ్యం

ప్రత్తిపాడు, జూలై 21: బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండం కారణంగా ఆదివారం కూడా భారీ వర్షాలు కురిశాయి. మండలంలో ఈ.గోకవరం గ్రామం వద్ద మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరువచ్చి చేరుతుంది. ఈ ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో కూడా భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో అధికమైంది. 87మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులో 78.28మీటర్ల వరకు నీటి మట్టం చేరుకుంది. గత 2 భారీ వర్షాలకు గణనీయంగా 8 మీటర్ల వరకు వరదనీరు చేరుకుంది. మండలంలోని కిత్తమూరుపేట గ్రామం వద్ద చంద్రబాబు సాగర్ ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున వరద జలాలు వచ్చి చేరుతున్నాయి. పెదశంకర్లపూడి, వెంకన్నదొర చెరువు, ఏలూరు వెంకటపతిరాజు చెరువు, ధర్మవరం రామభద్రరావు చెరువు, రాచపల్లి కొత్తచెరువు, ఒమ్మంగి గోపాలుడు రాజచెరువు, చింతలూరు రామానుజం చెరువుల్లోకి పెద్ద ఎత్తున వరదనీరు తరలివస్తుంది. ఖరీఫ్ వ్యవసాయ సాగుకు ఎంతో మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎడతెరిపిలేని వర్షం

కొత్తపల్లి, జూలై 21: కొత్తపల్లి మండలంలో ఆదివారం ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. మురుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్త కొట్టుకుపోయింది. ఈదురు గాలులకు ఇంటి పైకప్పులు ఎగిరిపోయిన మత్స్యకార బాధితులకు ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో ఆదివారం ఉదయం నుంచి వర్షం కురవగా ఆకుమడులు,వరినాట్లు నీట మునిగాయి.

తొండంగి: గత 3రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం ఆదివారం కూడా కొనసాగింది. దీంతో ప్రజాజీవనం స్తంభించింది. ఎండిన చెరువుల్లోకి వర్షం నీరు చేరింది. అరటి, చెరకు, కూరగాయల పంటల నారుమళ్లకు వర్షం మేలు చేస్తుందని రైతులు భావిస్తున్నారు.

కిర్లంపూడి: ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురవగా కిర్లంపూడి ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

రౌతులపూడి: 3రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తిచేలో నీరు చేరడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మండలంలోని సుమారు 1000 ఎకరాల్లో పత్తిచేలు వేశారు. పత్తితో పాటు బీర, బెండ, సిక్కుడు పంటలకు వర్షాలతో నష్టం వాటిల్లుతుందని ఆవేదన చెందుతున్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు



కాకినాడలో శాకంబరిగా బాలాత్రిపురసుందరి, తునిరూరల్: శాకంబరిగా వర మహాలక్ష్మి

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 21: నగరంలోని సూర్యారావుపేటలోని శ్రీ బాలాత్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సీహెచ్‌వీ భాస్కరరెడ్డి ఎమ్మెల్యేలకు స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గ్రంధి బాబ్జి, టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, లయన్స్ క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ, దుర్గా సోము ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సోము ప్రసాద్ పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట శివాలయంలో సర్వకామాదాంబ అమ్మవారిని వివిధ కూరగాయలు, పండ్లతో అర్చకులు కొత్తపల్లి కామేశ్వరరావు శాకంబరి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాల స్వామి ఆలయం నందుఅమ్మవార్లకు.. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నందు అమ్మవార్లకు శాకంబరిగాఅలంకరించగా భక్తులు పాల్గొన్నారు.

పెద్దాపురం: భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల కూరగాయాలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టీవీ సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు.

తుని రూరల్: తుని మెట్రో ప్రాంగణంలో శ్రీ వైకుంఠ నారాయణ సహిత శ్రీ వర మహాలక్ష్మి అమ్మవారు శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎస్.అన్నవరం గ్రామదేవత నూకాలమ్మ శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాత సంచులవర్తకసంఘం సభ్యులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


వైసీపీ దాడిలో టీడీపీ కార్యకర్తలకు అయిన గాయాల ఫొటోలను చూపిస్తున్న వర్మ

పిఠాపురం, జూలై 21: వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటిని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరడం విడ్డూరంగా ఉందని, గత ఐదేళ్లలో ఏమి చేశారో గుర్తు లేదా అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ధ్వజమెత్తారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్మ మాట్లాడుతూ వినుకొండ పర్యటన సందర్భంగా జగన్ చేసిన వాఖ్యలను ఖండించారు. పుంగనూరులో చంద్రబాబు పర్యటన సమయంలో వైసీపీ నేతలు దాడులు చేసి టీడీపీ కార్యకర్తలను గాయపరిచి తిరిగి వారిపై, చంద్రబాబుపై హత్యాయత్నం కేసులు బనాయించారని మండిపడ్డారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టిన సంగతిని గుర్తుంచుకోవాలన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో రఘురామకృష్ణంరాజును అరెస్టు చేసి కస్టడీలో ఉన్న సమయంలో తీవ్ర చిత్రహింసలకు గురిచేయడంతో పాటు రాష్ట్రంలో తమ వ్యతిరేకులపై రకరకాల అక్రమ కేసులు బనాయించి వేదింపులకు పాల్పడ్డారని తెలిపారు. కాకినాడ డివిజన్‌లో పోలీసులను వైసీపీ వాసన ఇంకా వద్దల్లేదని.. కాకినాడ డీఎస్పీ, కొత్తపల్లి ఎస్‌ఐలు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ ఆదేశించినా వీరిలో చలనం లేదని పేర్కొంటూ కత్తులతో జరిగిన దాడిలో గాయపడిన వారి ఫోటోలను ప్రదర్శించారు. తక్షణం డీఎస్పీ, ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మహాసంస్థానంలో పూజలు

పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని మాజీ ఎమ్మెల్యేవర్మ, లక్ష్మీదేవి దంపతులు దర్శించుకున్నారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయుడు, నృసింహసరస్వతులకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సౌజన్య వర్మ దంపతులకు శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్త దాడికి యత్నం

శంఖవరం, జూలై 21: మండలంలోని కత్తిపూడి గ్రామంలో టీడీపీ కార్యకర్త, గత ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన కొయ్య రమణపై వైసీపీ కార్యకర్త దూళ్ళ కనకరావు కత్తితో దాడికి యత్నించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... కొయ్య రమణ గత సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశాడు. అలాగే గత సాధారణ ఎన్నికల్లో కూడా టీడీపీకి పనిచేశాడు. అయితే ప్రత్యర్థి వర్గంలో ఉన్న వైసీపీ కార్యకర్త దూళ్ల కనకరావు ఆదివారం కత్తిపూడిలో రమణ ఒంటరిగా బండిపై వెళ్లడాన్ని గమనించి కత్తితో దాడికి యత్నించాడు. దుర్భాషాలాడుతూ కత్తితో గాయపరచబోయాడు. దీనిపై రమణ దూళ్ళ కనకరావుతో పాటు దూళ్ళ శివపై అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


అన్నవరంలో విరాళం అందజేస్తున్న దాత

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూలై 21: అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి చింతలపూడికి చెందిన జల్లిపల్లి మల్లేశ్వరరావు జయలక్ష్మి దంపతులు ఆదివారం రూ.1,01,116 విరాళాన్ని అన్నదాన విభాగ సూపరెంటెండెంట్ కంచి మూర్తికి అందజేశారు. ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

జనసేన ఇన్సూరెన్స్ చెక్ అందజేత


చెక్ అందజేస్తున్న నాగేంద్రబాబు, తుమ్మలపల్లి

జగ్గంపేట, జూలై 21: గోకవరం మండలం అచ్యుతాపురానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యులు గోకా యేసురాజు, గుమ్మలదొడ్డికి చెందిన వల్లేటి బాపసుబ్రహ్మణ్యం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రూ.5లక్షలు ఇన్సూరెన్స్ చెక్‌ను ఆదివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు, జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ బాధిత కుటుంబాలకు ఇచ్చారు.

బాధిత కుటుంబాలకు సాయం

తాళ్లరేవు, జూలై 21: ఉప్పంగల, తెలుగోడుపాలెంలో పంపన చిన్న నాగేశ్వరరావు, తంగేటిపంపులో కాజ లక్ష్మిలు అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులకు దడాల సువర్ణలత, వెంకటరమణ దంపతులు 50 కిలోల బియ్యం, 2 నెలలకు సరిపడా కిరాణా సామగ్రి అందించారు.

దుర్గమ్మ ఆలయంలో రద్దీ

గండేపల్లి, జూలై 21: మురారిలో కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుని పూజలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు.